

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 19-07-2026 | సంపుటి - 29 | సంచిక - 57 | రూ : 4 | పేజీలు : 8






## 'భారత్‌ను గర్వపడేలా చేశారు'.. విక్రమ్-1 విజయంపై స్కైరూట్‌కు మోదీ ఫోన్!

- 'భారత్‌ను గర్వపడేలా చేశారు' అంటూ ప్రశంస
- యువతపై తన నమ్మకం నిజమైందన్న ప్రధాని
- విక్రమ్-1తో అంతరిక్షంలోకి మోదీ రాసిన 'వందేమాతరం' సందేశం

ఢిల్లీ : భారత తొలి ప్రైవేట్ రాకెట్ విక్రమ్ 1 ప్రయోగం విజయవంతమైన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ స్కైరూట్ బృందానికి ఫోన్ చేసి అభినందించారు. సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో సంబరాలు జరుగుతున్న సమయంలో వచ్చిన ఈ కాల్‌లో యువ శాస్త్రవేత్తల కృషిని ప్రధాని ప్రశంసించారు. స్కైరూట్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు పవన్ కుమార్‌తో మాట్లాడిన మోదీ.. "మీరు భారత్‌ను గర్వపడేలా చేశారు. భారత ఆశయాలను అంతరిక్షంలో నిలబెట్టారు. యువత కలలకు బలమైన పునాది వేశారు" అని అన్నారు. భారత యువతపై తరువాయి 2లో

## పదేళ్లు అధికారంలో ఉండి.. ఉద్యోగాలు ఎందుకివ్వలేదు?

### పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను నడిబజార్‌లో పల్లీ బఠానీల్లా అమ్మేసిన చరిత్ర భారాసది

- కేవలం అరవై రోజుల్లోనే మేము 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం
- ఏడాదిలో 70 వేల మందికి నియామకపత్రాలు అందజేశాం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అందెశ్రీ స్మృతివనానికి ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులతో కలిసి శంకుస్థాపన

**హైదరాబాద్, 18 జూలై :** 'కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో క్రమం తప్పకుండా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నాం.. కేవలం 60 రోజుల్లో 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం.. ఏడాదిలో 70వేల మందికి నియామక పత్రాలిచ్చాం.. పదేళ్లు అధికారంలో ఉండి మీరెందుకు ఉద్యోగాలివ్వలేదు? పోటీపరీక్షల ప్రశ్నపత్రాలను నడిబజార్‌లో పల్లీ, బఠానీలుగా అమ్మేసి రూ.కోట్లు సంపాదించుకున్నారు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారాస నాయకులపై విరుచుకుపడ్డారు.



హైదరాబాద్ శివారులోని ఘట్‌కేసర్‌లో ప్రభుత్వం శనివారం నిర్వహించిన డాక్టర్ అందెశ్రీ 65వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అందెశ్రీ స్మృతివనానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి తరువాయి 2లో



## నోటిఫికేషన్లు లేవు.. అన్నీ లూటిఫికేషన్లే

- తెలంగాణ యువతకు రాహుల్ వెన్నుపోటు
- నిరుద్యోగులపై సీఎం రేవంత్‌ది అహంకార ధోరణి
- 70 వేల ఉద్యోగాలిచ్చినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి వైదొలుగుతా
- యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్

2లో




## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు..

### రూ.10, రూ.20 నోట్లపై పైలట్ ప్రాజెక్ట్

- ప్లాస్టిక్ కరెన్సీ నోట్ల దిశగా ఆర్బీఐ కీలక ముందడుగు
- అధునాతన పాలిమర్ షీట్ల కోసం గ్లోబల్ టెండర్లు జారీ
- పైలట్ ప్రాజెక్టు కింద తొలుత రూ.10, రూ.20 నోట్ల పరిశీలన
- మన్నిక పెంచి, ముద్రణ ఖర్చు తగ్గించడమే ప్రధాన లక్ష్యం
- టెండర్లలో చైనా, పాకిస్థాన్ కంపెనీలపై కఠిన నిబంధనలు

2లో

## దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు.. తస్మాత్ జాగ్రత్త..!



- మళ్లీ కరోనా కలకలం
- ఏపీ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో పెరుగుతున్న కేసులు

హైదరాబాద్: కరోనా మహమ్మారి మళ్లీ జూలు విదుల్చుతోంది. ఏపీ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో కేసులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కరోనా లక్షణాలతో ఏపీలో నలుగురు మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. వారంతా దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు మధుమేహం, దీర్ఘకాలంగా స్టెరాయిడ్లు తీసుకుంటున్నవారు, క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటున్న రోగులు, ఆస్తమా, సీవోపీడీ వంటివాటితో బాధపడుతున్నవారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని.. పిల్లలు, వృద్ధులు, గర్భిణుల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కనిపిస్తున్న వైరస్ వేరియంట్‌ను గుర్తించేందుకు శాంపిళ్లను పుణె ల్యాబ్‌కు పంపారు. అయితే పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. కరోనా ఎండెమిక్ స్థాయిలో ఉండటం వల్ల వ్యాప్తి కూడా తక్కువగా ఉంటుందన్నారు.




## నిరంతర విద్యుత్తు సరఫరా లక్ష్యం

- యంత్రాంగానికి ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం

## హైదరాబాద్‌లో ఫిఫా ఫీవర్

### ప్రత్యేక ఫుట్‌బాల్ కారు ఆవిష్కరణ



- ప్రముఖ ఆవిష్కర్త, సుధా కార్స్ మ్యూజియం వ్యవస్థాపకుడు సుధాకర్ దీని రూపకర్త
- హైదరాబాద్ నగరంలో ఫిఫా ప్రపంచకప్ ఫుట్‌బాల్ ఫీవర్

2లో

# పదేళ్లు అధికారంలో ఉండి.. ఉద్యోగాలు ఎందుకివ్వలేదు?

హైదరాబాద్: 'కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో క్రమం తప్పకుండా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నాం.. కేవలం 60 రోజుల్లో 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం.. ఏడాదిలో 70వేల మందికి నియామక పత్రాలిచ్చాం.. పదేళ్లు అధికారంలో ఉండి మీరెందుకు ఉద్యోగాలివ్వలేదు? పోటీపరీక్షల ప్రశ్నపత్రాలను నడిబజార్‌లో పల్లీ, బఠానీలుగా అమ్మేసి రూ.కోట్లు సంపాదించుకున్నారు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారాస నాయకులపై విరుచుకుపడ్డారు. హైదరాబాద్ శివారులోని ఘట్‌కేసర్‌లో ప్రభుత్వం శనివారం నిర్వహించిన డాక్టర్ అందెశ్రీ 65వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అందెశ్రీ స్మృతివనానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ మాట్లాడారు. కేసీఆర్‌పై, భారాసపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ ప్రజలు అధికారమిస్తే.. కేవలం మీ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలిప్పించుకున్నారు. తెలంగాణ ప్రజలను చైతన్యవంతులుగా చేసే కవులు, గాయకులను అవమానపరిచినందుకే వారి పాటలు మరఫిరంగులై మీ పాలనను మట్టుబెట్టాయి. అందెశ్రీ, గద్దరన్నల స్ఫూర్తితో మేము ప్రజా ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నాం. మీరు ఉద్యమకారులు, కవులు, కళాకారులను ఛీత్కార ధోరణితో చూశారు. అందుకే మీరు (కేసీఆర్) ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు.



*** నిరుద్యోగుల బాధలను పట్టించుకున్నారా?**

ఉద్యోగాల గురించి ఇప్పుడు మాట్లాడుతున్న మీరు, మీ నాయకులు.. నాడు నిరుద్యోగుల బాధలను ఎప్పుడైనా పట్టించుకున్నారా? మానవీయ కోణంలో ఆలోచించారా? తల్లిదండ్రులు చెమటోడ్చి పైసాపైసా కూడబెట్టిన కొద్దిపాటి సొమ్ముతో హైదరాబాద్‌కు వచ్చి పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులను నాడు మీరు పట్టించుకోలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011 సంవత్సరం గ్రూప్ 1 కొలువులకు నోటిఫికేషన్ ఇచ్చిందే ఆఖరు... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక 2024లో గ్రూప్ 1కు నోటిఫికేషన్ ఇచ్చాం. 2011లో డిగ్రీ పూర్తిచేసిన యువకులు పదమూడేళ్ల పాటు కొలువులు వస్తాయని హైదరాబాద్ చుట్టూ తిరిగారు.. అప్పుడు మీకు వారు గుర్తుకు రాలేదా? ఉద్యోగాల నోటిఫికేషన్ రాదేమోనని మెదక్ జిల్లాకు చెందిన మురళి ముదిరాజ్ ఉరేసుకుని చనిపోయాడు. అలాంటివారు పదుల సంఖ్యలో ఉన్నారు. మీ కుటుంబ సభ్యులకు మాత్రం ఉద్యోగాలు వచ్చాయి. మా ప్రభుత్వం వచ్చాకే ట్యాంక్‌బండ్ బీఆర్ అంబేద్కర్ సాక్షిగా... ఎల్బీ స్టేడియంలో, శిల్పారామంలో 70 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో అందించాం. వారి కళ్లల్లో సంతోషాన్ని చూసి మేమెంతో ఆనందించాం.

*** నిజాం నవాబు కంటే ఎక్కువగా సంపాదించారు... తెలంగాణకేమిచ్చారు?**

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నామని మాయమాటలు చెప్పి పదేళ్లు అధికారంలో ఉన్న మీరు రూ.లక్షల కోట్లు దోచుకున్నారు. నిజాం నవాబు కంటే ఎక్కువగా సంపాదించారు. ఇందుకు ప్రతిఫలంగా ప్రజలపై రూ.8.11 లక్షల కోట్ల భారం మోపారు. తెలంగాణ యువకులు బలిదానం చేసి మీకు అధికారం కట్టబెడితే సమాజానికి మీరేం తిరిగి ఇచ్చారు? తెలంగాణ ప్రజలుగా మీ దోపిడీని అంత తేలిగ్గా మర్చిపోతామా? శ్రీకాంతాచారి ఆత్మబలిదానం చేసుకుంటే ఆయన తల్లి శంకరమ్మను ఏనాడైనా గుర్తించారా? మా ప్రభుత్వంలో మహిళా కమిషన్ సభ్యురాలిని చేశాం. మీ కుటుంబం.. తులసివనంలా ఉన్న తెలంగాణ సమాజంలో పెరిగిన గంజాయి మొక్కలా ఉంది. ఇప్పటికే పెకిలించాం. మళ్లీ మొలకెత్తనివ్వం.. రాసుకోండి.. రికార్డు చేసుకోండి... 2034 వరకూ ప్రజాప్రభుత్వమే ఉంటుంది.

## హైదరాబాద్‌లో ఫిఫా ఫీవర్
## ప్రత్యేక ఫుట్‌బాల్ కారు ఆవిష్కరణ

ఫిఫా ప్రపంచకప్ 2026 తుది అంకానికి చేరుకుంటున్న తరుణంలో, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఫుట్‌బాల్ ఉత్సాహానికి హైదరాబాద్ నగరం తనదైన శైలిలో కొత్తదనాన్ని జోడించింది. నగరానికి చెందిన ప్రముఖ సృజనకర్త కారుమూరి సుధాకర్ రూపొందించిన ఫుట్‌బాల్ ఆకృతిలోని ఒక ప్రత్యేక కారును శనివారం ఆవిష్కరించారు. ఈ వినూత్న వాహనం ప్రస్తుతం అందరి దృష్టిని విశేషంగా ఆకర్షిస్తోంది. గతంలో నిరుపయోగమైన వస్తువులు, స్క్రాప్ మెటీరియల్‌తో ఎన్నో అద్భుతమైన వాహనాలను సృష్టించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన సుధాకర్, ఈసారి ఫుట్‌బాల్ అభిమానుల కోసం ఈ ప్రత్యేక కారును తీర్చిదిద్దారు. బహదూర్‌పురాలోని 'సుధా కార్స్ మ్యూజియం' వ్యవస్థాపకుడైన ఆయన, గతంలోనూ క్రీడాంశాల నేపథ్యంలో పలు వినూత్న వాహనాలను రూపొందించడం గమనార్హం. ప్రస్తుతం ఫిఫా ప్రపంచకప్ నేపథ్యంలో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలు ఫ్యాన్ జోన్లుగా రూపాంతరం చెందాయి. మెస్సీ, రొనాల్డో, నెయ్‌మార్ వంటి మేటి క్రీడాకారుల భారీ పోస్టర్లు, పతాకాలతో ఆయా ప్రాంతాలు కోలాహలంగా మారాయి. ఈ క్రమంలో సుధాకర్ ఆవిష్కరించిన ఈ ఫుట్‌బాల్ కారు నగరంలో ఫుట్‌బాల్ ఉత్సాహాన్ని మరింతంగా పెంచుతోంది.

'భారత్‌ను గర్వపడేలా చేశారు'..
## విక్రమ్1 విజయంపై స్కైరూట్‌కు మోదీ ఫోన్!

(మొదటిపేజీ తరువాయి)
తనకున్న నమ్మకాన్ని ఈ బృందం నిజం చేసిందని కొనియాడారు. దీనికి పవన్ స్పందిస్తూ.. తమ బృందం సగటు వయసు కేవలం 28 ఏళ్లు మాత్రమేనని చెప్పారు. దీనిపై మోదీ మాట్లాడుతూ.. భారత యువతను నమ్మితే అద్భుతాలు చేయగలరని ఈ విజయం మరోసారి నిరూపించిందన్నారు. ఈ చారిత్రక క్షణంలో తాను కూడా భాగం కావాలనే ఉద్దేశంతోనే ఫోన్ చేసినట్లు చెప్పారు. 'ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ మిషన్ స్కైరూట్ ప్రయాణానికి ఆరంభం మాత్రమేనని, ముందు ఇంకా ఎన్నో విజయాలు సాధించాలని మోదీ ఆకాంక్షించారు. ఈ తొమ్మిది నిమిషాల సంభాషణలో భారత అంతరిక్ష రంగాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లినందుకు బృందాన్ని అభినందించారు. ప్రయోగానికి ముందు ప్రధాని చేతిరాతలో పంపిన 'వందేమాతరం' సందేశాన్ని విక్రమ్ 1తో పాటు అంతరిక్షంలోకి తీసుకెళ్లినట్లు పవన్ తెలిపారు. దీనిపై స్పందించిన మోదీ.. జాతీయ గీతానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా, యువతకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలిచే సందేశం కావడంతోనే ఆ పదాలను రాశానన్నారు. చివరగా "ముందుకు సాగండి... మరింత ఎత్తుకు ఎగరండి... నేను మీ వెంటే ఉంటాను" అంటూ స్కైరూట్ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.



## నిరంతర విద్యుత్తు సరఫరా లక్ష్యం

హైదరాబాద్: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల్లో డిమాండ్‌ను తట్టుకుని నిరంతర కరెంటు సరఫరా లక్ష్యంగా యంత్రాంగం పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా పకడ్బందీ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. శనివారం దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్పీడీసీఎల్) ప్రధాన కార్యాలయంలో విద్యుత్‌శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సీఎండీలు, అధికారులు పాల్గొన్నారు. 'కొందామంటే.. కరెంటు లేదాయె' శీర్షికతో శనివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై భట్టి స్పందించి విద్యుత్ కొనుగోళ్ల వివరాలను ఆరాతీశారు. ప్రభుత్వశాఖల నుంచి బకాయిలు వసూలు చేయాలని, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో అభివృద్ధి చేసిన మోడల్ సబ్‌స్టేషన్‌ను ఆదర్శంగా తీసుకుని, మిగతావాటిని దశల వారీగా ఆధునికీకరించాలని కోరారు. కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్ వంటి ప్రాంతాల్లో భూమి కొరత దృష్ట్యా ఫ్లైఓవర్ల కింద సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు మున్సిపల్‌శాఖతో కలసి పనిచేయాలన్నారు. 'పవర్ అంబులెన్స్' సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలన్నారు. ప్రస్తుతం 21 సర్కిళ్ల పరిధిలో 168కి పైగా వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు




చేశామని అధికారులు తెలిపారు. ఎర్రగడ్డలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా వేగంగా సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

**సింగరేణి కొత్త బ్లాక్‌లను సాధించాలి**

పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సింగరేణి సంస్థ కొత్త బొగ్గు బ్లాక్‌లను సాధించి, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఇటీవల మైనింగ్ లీజు లభించిన తాడిచర్ల 2 బ్లాక్‌లో యుద్ధప్రాతిపదికన బొగ్గు ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా కొత్త గనుల సాధనలో గత ప్రభుత్వం విఫలమైందని, దాని ప్రభావం ప్రస్తుతం సింగరేణిపై ఇప్పుడు పడుతోందన్నారు. రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాలకు నాణ్యమైన బొగ్గును నిరంతరం సరఫరా చేసేలా కార్యాచరణను అమలు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని భట్టి ఆదేశించారు.

## నోటిఫికేషన్లు లేవు.. అన్నీ లూటిఫికేషన్లే

హైదరాబాద్ : 'యూత్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్.. నిరుద్యోగ యువతను దారుణంగా మోసగించింది. అందుకే యూత్ డిక్లరేషన్ ఇచ్చిన వేదికపైనే నిరుద్యోగ యువత.. కాంగ్రెస్ పార్టీకి రాజకీయ మరణశాసనం రాస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు నోటిఫికేషన్లతో సహా నిరూపిస్తే రాజకీయాల నుంచి వైదొలుగుతా' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ విసిరారు. తమ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లను వారి ఖాతాలో వేసుకుని కాంగ్రెస్ పార్టీ క్రెడిట్ చోరీకి పాల్పడుతోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాంలో నోటిఫికేషన్లు లేవని.. అన్నీ లూటిఫికేషన్లేనని ఆరోపించారు. తెలంగాణ యువతకు రాహుల్ వెన్నుపోటు పొడిచారన్నారు. భారాస యువజన విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అధ్యక్షతన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన భారాస యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడారు. యువగళాలు గర్జిస్తే కుర్చీలు కూలిపోతాయని... ఇక్కడికి భారీగా వచ్చిన యువకులను చూస్తుంటే ఇప్పటిదాకా ఒక లెక్క, ఇప్పటి నుంచి మరో లెక్క అన్నట్టుగా ఉందని అన్నారు. "తెలంగాణ ఉద్యమంలో వేలమంది విద్యార్థులను పొట్టనపెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ... జిత్తులమారి నక్కలా మారి పలు హామీలిచ్చి యువతను మోసం చేసింది. నకిలీ ప్రేమ కురిపించి యువతను బలిపీఠం ఎక్కించింది. ఎన్నికలకు ముందు ఇదే సరూర్‌నగర్ స్టేడియం వేదికగా యూత్ డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? ఏడాదిలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, రూ.4వేల నిరుద్యోగ భృతి, కళాశాల అమ్మాయిలకు ఎలక్ట్రిక్ స్కూటర్లు... ఇలా 24 హామీల్లో ఒక్కటైనా నెరవేరిందా? 'ఓటు కొట్టు.. జాబ్ పట్టు' అని ప్రకటనలు ఇచ్చిన కాంగ్రెస్.. నేడు జాబ్ క్యాలెండర్ ఊసెత్తడం లేదు. యువతకు జాబులు లేవు.. దిల్లీలో రాహుల్ జేబులు నింపే పనిలో సీఎం బిజీగా ఉన్నారు. రాహుల్‌గాంధీని ప్రధాని చేసేవరకు విశ్రమించబోనని రేవంత్‌రెడ్డి అంటున్నారు. పదవి ఇచ్చింది యువతకు జాబులు ఇచ్చేందుకా.. రాహుల్‌కు జాబ్ ఇచ్చేందుకా? జంగ్ సైరన్ మోగించడానికి యువతరం రాష్ట్రంలోని వేర్వేరు విశ్వవిద్యాలయాల నుంచి కదలివచ్చింది. రాహుల్‌గాంధీ, ప్రియాంకల వెన్నుపోటును గుర్తుపెట్టుకుని... కచ్చితంగా గుణపాఠం చెబుతుంది. రాజ్యాంగం పట్టుకుని దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యం గురించి మాయమాటలు చెప్పే రాహుల్ గాంధీ.. తెలంగాణలోని నిరుద్యోగుల వీపులపై పోలీసు లాఠీలు మోగుతోంటే, అక్రమ కేసులతో ఆడబిడ్డలని కూడా చూడకుండా అణచివేస్తుంటే ఏం చేస్తున్నారు? అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్ వేదికగా కొలువులు అడుగుతున్న నిరుద్యోగులపై రేవంత్‌రెడ్డి సర్కారు లాఠీఛార్జీలు, అర్ధరాత్రి అరెస్టులతో దమనకాండ సాగిస్తోంది" అని కేటీఆర్ మండిపడ్డారు. నిరుద్యోగుల పట్ల ముఖ్యమంత్రి అహంకార ధోరణికి రాబోయే రోజుల్లో యువత గట్టిగానే సమాధానం చెబుతారని.. ఓటుతో కాంగ్రెస్ కథను ముగిస్తారని అన్నారు.

*** అధికారంలోకి రాగానే పారదర్శకంగా నోటిఫికేషన్లు**

రాబోయే రెండేళ్లపాటు ప్రజాసమస్యలపై గట్టిగా పోరాటం చేస్తామని, ఆ తర్వాత అధికారంలోకి రాగానే యువత ఆశించిన విధంగా పారదర్శకంగా నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని స్పష్టంచేశారు. గతంలో కొన్ని పొరపాట్లు జరిగాయని.. ఈసారి అలాంటివి పునరావృతం కాకుండా అన్నగా తానే బాధ్యత తీసుకుంటానని యువతకు, నిరుద్యోగులకు భరోసా ఇచ్చారు. బుల్డోజర్ల విధ్వంసం, అవినీతి బురదలో రాష్ట్ర ప్రభుత్వం కూరుకుపోయిందని.. ఇక్కడ సర్కారు లేదని, సర్కస్ నడుస్తోందని అన్నారు. నేపాల్‌లో మాదిరి భూకంపం పుట్టించాలని, శ్రీలంకలో మాదిరి శివతాండవం చేసి ప్రభుత్వాన్ని పడగొట్టాలని చెప్పడం లేదని... విధ్వంసాలకు, అల్లర్లకు భారాస ఎప్పుడూ పిలుపునివ్వదని స్పష్టం చేశారు.

## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. రూ.10, రూ.20 నోట్లపై పైలట్ ప్రాజెక్ట్

భారత కరెన్సీ స్వరూపాన్ని మార్చే దిశగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక ముందడుగు వేసింది. దేశంలో మరింత మన్నికైన, సురక్షితమైన పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా, తక్కువ విలువ కలిగిన నోట్ల కోసం పైలట్ ప్రాజెక్టును ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ ప్రాజెక్టు కోసం అవసరమైన ప్రత్యేక ముడిపదార్థం సరఫరా కోసం ఆర్బీఐ అనుబంధ సంస్థ గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. ఆర్బీఐ కరెన్సీ ముద్రణ విభాగమైన భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ ప్రైవేట్ లిమిటెడ్ (బీఆర్‌బీఎన్ఎంపీఎల్), ఈ గ్లోబల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఈఓఐ)ను నేడు జారీ చేసింది. అధునాతన భద్రతా ఫీచర్లను కలిగి ఉండే ఒపాసిఫైడ్ బైయాక్సియల్లీ ఓరియెంటెడ్ పాలీప్రొపైలిన్ (బీఓపీపీ) పాలిమర్ షీట్ల కోసం ఈ టెండర్ పిలిచారు. రెండు వేర్వేరు డినామినేషన్ల కోసం మొత్తం 68,000 రీముల (ఒక్కోదానికి 34,000 రీములు) మెటీరియల్ అవసరమని పేర్కొన్నారు. బిడ్లు దాఖలు చేయడానికి ఆగస్టు 18ని చివరి తేదీగా నిర్ణయించారు.

*** తొలుత రూ.10, రూ.20 నోట్లతో ప్రయోగం**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, పైలట్ ప్రాజెక్టులో భాగంగా మొదట రూ.10, రూ.20 నోట్లను పరీక్షించే అవకాశం ఉంది. మార్కెట్లో ఈ నోట్ల చలామణి ఎక్కువగా ఉండటం, ఇవి త్వరగా పాడైపోతుండటంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ఫీల్డ్ ట్రయల్స్ వచ్చే ఏడాది ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇవి విజయవంతమైతే 2027 నుంచి దశలవారీగా ప్లాస్టిక్ నోట్లను విస్తృతంగా చలామణిలోకి తీసుకురావొచ్చని భావిస్తున్నారు. అయితే, దీనిపై ఆర్బీఐ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, ప్లాస్టిక్ నోట్ల ప్రతిపాదన ప్రాథమిక పరిశీలనలో ఉందని, వాటి లాభనష్టాలను అంచనా వేస్తున్నామని వెల్లడించారు.

**ఎందుకీ మార్పు?**

ప్రస్తుతం దేశంలో వాడుతున్న కరెన్సీ నోట్లను 100% కాటన్ ఆధారిత కాగితంతో ముద్రిస్తున్నారు. ఇవి రోజువారీ వాడకంలో త్వరగా చిరిగిపోవడం, మురికిగా మారడం జరుగుతోంది. దీనివల్ల ప్రతి ఏటా కొన్ని కోట్ల సంఖ్యలో పాత నోట్లను ఆర్బీఐ వెనక్కి తీసుకుని నాశనం చేయాల్సి వస్తోంది. ఆర్థిక సంవత్సరం 2025లో కరెన్సీ ముద్రణ ఖర్చు రూ. 6,372.8 కోట్లకు పెరిగింది. అంతకుముందు ఏడాది ఇది రూ. 5,101.4 కోట్లుగా ఉండేది. ఈ నేపథ్యంలో, మన్నికైన పాలిమర్ నోట్ల వైపు ఆర్బీఐ దృష్టి సారించింది. పాలిమర్ నోట్లు కాగితం నోట్ల కంటే రెండు నుంచి ఐదు రెట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. దీంతో దీర్ఘకాలంలో ముద్రణ, పంపిణీ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. ఇవి శుభ్రంగా ఉండటంతో పాటు, నకిలీ చేయడం కష్టతరం చేసే క్లియర్ విండోస్ వంటి అదనపు భద్రతా ఫీచర్లను కలిగి ఉంటాయి. ఇప్పటికే ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా సహా 50కి పైగా దేశాలు ప్లాస్టిక్ నోట్లను విజయవంతంగా ఉపయోగిస్తున్నాయి.

**గత ప్రయత్నాలు.. ప్రస్తుత నిబంధనలు**

భారత్‌లో ప్లాస్టిక్ నోట్ల ప్రయోగం ఇదే మొదటిసారి కాదు. 2012లో రూ.10 విలువైన 100 కోట్ల ప్లాస్టిక్ నోట్లను కొచ్చి, మైసూర్, జైపూర్ వంటి నగరాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలని భావించినా, సాంకేతిక కారణాలతో ఆ ప్రణాళిక కార్యరూపం దాల్చలేదు. తాజా టెండర్‌లో ఆర్బీఐ కఠినమైన నిబంధనలను విధించింది.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన జే.కె.శేఖర్ యాదవ్



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : ఇటీవల మేడ్చల్ జిల్లా ఓబీసీ అధ్యక్షులుగా నియమితులైన జెకె శేఖర్ యాదవ్ శనివారం కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జే.కె.శేఖర్ యాదవ్ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీ బలోపే పెతానికి కృషి చేయాలన్నారు. బీసీలను రాజకీయంగా ఎదగడానికి కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ సెల్ కోకన్వీనర్, మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, గోల్కొండ జిల్లా మాజీ అధ్యక్షులు పాండు యాదవ్ , మౌలాలి ఎక్స్ కార్పొరేటర్ సునీత యాదవ్ , డివిజన్ జనశక్తి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా పూర్తి చేయాలి

* రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి




జయశంకర్ భూపాలపల్లి , ప్రజాస్ఫూర్తి : ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) 2026 ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ హరి చందన దాసరి అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ లో హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఎన్యుమరేషన్, ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలైజేషన్, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చడం, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమీక్షలో హనుమకొండ జిల్లాలో 68.13 శాతం, వరంగల్ లో 71 శాతం, మహబూబాబాద్ లో 74 శాతం, జయశంకర్ భూపాలపల్లిలో 71.74 శాతం, ములుగులో 75.60 శాతం ఎస్ఐఆర్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తైనట్లు ఆయా జిల్లాల కలెక్టర్లు వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

# సోనం వాంగ్చుక్ దీక్షకు టీఆర్పీ సంఘీభావం

* భూపాలపల్లిలో భారీ ర్యాలీ నిర్వహణ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు మేరకు హక్కుల నేత, శాస్త్రవేత్త సోనం వాంగ్చుక్ చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతుగా శనివారం భూపాలపల్లిలో టీఆర్పీ ఆధ్వర్యంలో భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, సోనం వాంగ్చుక్ డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను రద్దు చేసి, దాని స్థానంలో నేషనల్ ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోనం వాంగ్చుక్ గత 20 రోజులుగా నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ నెల 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా "చలో సంసద్" కార్యక్రమానికి టీఆర్పీ రాష్ట్ర అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంపూర్ణ మద్దతు ప్రకటించారని, ఆయన పిలుపు మేరకే భూపాలపల్లిలో సంఘీభావ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత మనదే

: సర్పంచ్ నునావత్ కుమారి




ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గవర్నర్ రోటేరియన్ ఏకేఎస్ ఉదయ్ సుధీర్ పిలాని పిలుపుమేరకు బాబు క్యాంప్ హై స్కూల్ నందు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నునావత్ కుమారి పాల్గొని ఆమె మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని , మొక్కలు నాటడంతో పాటు మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత కూడా మనదే అని ఆమె అంటూ , పచ్చదనాన్ని పెంపొందించడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఆమె అంటూ రోటరీ క్లబ్ సేవలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం , రోటరీ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం అధ్యక్షురాలు రోటేరియన్ నీరజ , రోటేరియన్ సాయికుమార్ , రోటేరియన్ రమాదేవి, పీడీజీ రోటేరియన్ అబ్రహం , రోటేరియన్ ప్రసన్న కుమార్ రోటేరియన్ వెంకటరామయ్య , రాజశేఖర్ , రోటేరియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే

# అత్యుత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం

* రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు , మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్



రంగారెడ్డి జిల్లా, ప్రజాస్ఫూర్తి : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను దేశంలోనే అత్యుత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్ను మంత్రి సందర్శించి పాఠశాలలోని విద్యా, క్రీడా, మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమై ప్లేగ్రౌండ్ లో కాసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల మధ్య ఉండటం ఎంతో ఆనందంగా ఉందని, ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ పాఠశాలను చూసి సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక విద్యా వాతావరణం, డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, విశాలమైన క్రీడా మైదానాలు, బాస్కెట్ బాల్, వాలీబాల్, క్రికెట్ తదితర క్రీడా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. తమ చిన్నతనంలో ఇలాంటి సౌకర్యాలు లేకపోయినా కష్టపడి చదివి ఎదిగామని, ప్రస్తుతం విద్యార్థులకు లభిస్తున్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విజయం సాధించాలంటే కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావం అవసరమని పేర్కొన్నారు. పాఠశాలలో ఏర్పడే స్నేహాలు జీవితాంతం నిలుస్తాయని, పరస్పర గౌరవం, సహకారం, ముఖ్యంగా బాలికలను గౌరవించే సంస్కారాన్ని అలవర్చుకోవాలని అన్నారు. విజయం అనేది ఒక్కరోజులో రాదని, ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత కూడా వినయాన్ని కోల్పోకుండా నిరాడంబరంగా ఉండటమే నిజమైన గొప్పతనమని పేర్కొన్నారు. ఈ పాఠశాల నుంచి భవిష్యత్తులో వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు, పరిపాలనా అధికారులు తయారై రాష్ట్రానికి, దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులందరికీ ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని బలోపేతం చేస్తూ డైట్ ఛార్జీల పెంపు, విద్యార్థులకు పోషకాహారాన్ని అందించడం వంటి చర్యలు చేపట్టిందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం ద్వారా ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్ లో నాణ్యమైన విద్యను అందించేలా ఆధునిక మౌలిక వసతులతో కూడిన పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కృతజ్ఞతాభావంతో చదువుకోవాలని సూచించారు. విజయం అంటే కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించడం మాత్రమే కాదని, ఎంచుకున్న ప్రతి రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో శ్రమించాలని చెప్పారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నిరంతర కృషితో ప్రతి విద్యార్థి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నవీన్ కుమార్ రెడ్డి, మంచాల్ తహశీల్దార్, ఆరుట్ల సర్పంచ్ శోభారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అసమానతలు ఉన్నంతకాలం కమ్యూనిస్టులకు అంతం లేదు

* తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : ప్రజల్లో అసమానతలు కొనసాగుతున్నంతకాలం కమ్యూనిస్టు ఉద్యమానికి అంతం ఉండదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్ ఇల్లందు క్లబ్‌లో శనివారం నిర్వహించిన సీపీఐ జిల్లా రాజకీయ శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టు పార్టీలేనని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతతత్వ శక్తుల ప్రభావం పెరిగిందని, ప్రజా సమస్యలను విస్మరించి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇళ్లులేని నిరుపేదలకు భూమి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, ఏఐటీయూసీ నాయకులు మోటపలుకుల రమేష్, మాతంగి రామచందర్, పైళ్ల శాంతికుమార్, మామిడాల సమ్మిరెడ్డి, క్యాథరాజు సతీష్, పరమండ్ల రాజయ్య, కొరిమి సుగుణ, పెంట రవి, సోతుకు ప్రవీణ్‌కుమార్, నేరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, కుదుదుల వెంకటేష్, తాళ్ల పోశం, జి. శ్రీనివాస్, ఆసిఫ్ పాషా, కరీముల్లా తదితరులు శిబిరంలో పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ మంత్రి , శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా సూర్యాపేట పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సవరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జగదీశ్వర్ రెడ్డి నిండు నూరెళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆశీర్వదించారు. అనంతరం స్థానిక కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద సవరాల సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దురాజ్పల్లి వివేకానంద వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, , మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి బూర బాల సైదులు, గండూరి క్రపాకర్, మాజీ కౌన్సిలర్ భాష,బత్తుల రమేష్ , కౌన్సిలర్ లు తహిర్ బిన్ మన్సూర్, లింగా నాయక్, దంతాల సాయి ప్రియ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న కోహెన్స్ (సువెన్) ఫార్మ పై చర్యలు చేపట్టాలి

* సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు డిమాండ్




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న కోహెన్స్ (సువెన్) ఫార్మా పై జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ధర్మ బిక్షం భవనంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో 5,6 18 వార్డులకు విస్తరించి ఉన్న వస్త్ర తండా, దాసాయిగూడెం, దురాజ్ పల్లి, శాంతినగర్ ఆ ప్రాంతవాసులు కోహెన్స్ (సువెన్) ఫార్మా నుంచి వచ్చే కలుషితమైన నీటిని విడుదల చేయటం వల్ల భూగర్భ జలాలన్నీ కలుషితం చేసి ఆ నీరు నుంచి వచ్చే విషవాయువులతో వచ్చే దుర్వాసన వల్ల పిల్లలు, పెద్దలు, మహిళలు, వృద్ధుల ప్రాణాలతో చెలగాటమాడుతూ వారు అనారోగ్యానికి గురవుతున్న పట్టించుకోకుండా ఫార్మ కంపెనీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేని పక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్ , కప్పల రాము, బుల్లెదు వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# వాగ్ చుగ్ అక్రమ అరెస్టును ఖండించండి

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గత 20 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆమర నిరాహార దీక్ష చేస్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయటాన్ని ప్రజలు ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు.రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ స్థాయి పరీక్షల పేపర్స్ లీకేజ్ కి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయకపోవటానికి నిరసనగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ పర్యావరణ వేత్త శాస్త్రవేత్త సోనం వాంగ్ చుగ్, తదితరులను కేంద్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిందని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైన కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని ఆరోపించారు.23 లక్షల మంది రాసిన నీట్ ఎగ్జామ్ పేపర్ లీకై సుమారు 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే నిమ్మకు నీరెత్తినట్టు కేంద్ర ప్రభుత్వం ఉండటం సరికాదన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని రవి డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ దీక్షా శిబిరాన్ని సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ కేంద్ర ప్రతినిధి బృందం సందర్శించి మద్దతు తెలియజస్తున్నారని, జులై 20న చలో పార్లమెంట్ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతునిస్తూ ఆ నిరసన కార్యక్రమంలో జయప్రదం చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ నాయకులు బూర్గుల మోష, టియుసిఐ జిల్లా నాయకులు బోయిన ఉప్పలయ్య, పివైఎల్ జిలా నాయకులు ఈక శివకుమార్, సురేష్,రామచందర్, లక్ష్మి సుజాత తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# పటాన్‌చెరు–కూకట్‌పల్లి కోర్టు మధ్య రెండో బస్సు సర్వీస్ ప్రారంభం



కూకట్ పల్లి , ప్రజాస్ఫూర్తి : బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సౌకర్యార్థం పటాన్‌చెరు నుంచి కూకట్‌పల్లి కోర్టు వరకు రెండో బస్సు సర్వీసును ప్రారంభించినట్లు బార్ అసోసియేషన్ ప్రకటించింది.ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు పటాన్‌చెరు నుంచి బయలుదేరే బస్సు ఆర్‌సీ పురం, బీరంగూడ ఆర్చ్, అశోక్‌నగర్, భెల్ జంక్షన్, చందానగర్, గంగారం, మదీనాగూడ, ఆల్విన్ ఎక్స్ రోడ్స్, మియాపూర్, హైదర్‌నగర్, జేఎన్‌టీయూ, లులు మాల్, నెక్సస్ మాల్, మలేషియన్ టౌన్‌షిప్, 9వ ఫేజ్ మీదుగా ప్రయాణించి ఉదయం 10:15 గంటలకు కూకట్‌పల్లి కోర్టుకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 5:15 గంటలకు కూకట్‌పల్లి కోర్టు నుంచి బయలుదేరి అదే మార్గంలో ప్రయాణించి సాయంత్రం 6:15 గంటలకు పటాన్‌చెరు చేరుకుంటుంది.ఈ ఉచిత రవాణా సౌకర్యాన్ని బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది అందరూ సద్వినియోగం చేసుకుని బస్సు సేవ విజయవంతంగా కొనసాగేందుకు సహకరించాలని బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.ఈ బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడానికి సహకరించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బార్ కౌన్సిల్ సభ్యుడు అశోక్ గౌడ్, గౌరవ న్యాయాధికారి , టీజీఎస్ఆర్టీసీ అధికారులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి. పి, ప్రధాన కార్యదర్శి కె. సురేందర్ గౌడ్‌తో పాటు కార్యవర్గ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వేధింపులు భరించలేక భర్తను చంపిన భార్య, కొడుకు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: వేధింపులు భరించలేక భర్తను భార్య, కొడుకు కలిసి చంపిన ఘటన ముస్తాబాద్ మండల కేంద్రంలోని కెసిఆర్ నగర్‌లో జరిగింది. కెసిఆర్ నగర్‌లోని డబుల్ బెడ్ రూం ఇండ్లలో నివాసముండే మహమ్మద్ షాదుల్‌ను అతని భార్య హఫీజా, కొడుకు అస్రఫిన్ చంపారు. షాదుల్ రోజూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య, కొడుకును వేధించేవాడు. ఈ వేధింపులు తట్టుకోలేక అతన్ని చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 16న మధ్యాహ్నం సాదుల్ మద్యం సేవించి, ఇంటికి వచ్చాడు. భార్య, కొడుకు ముందుగా అనుకున్న విధంగా కొడుకు అస్రఫిన్ క్రికెట్ బ్యాట్‌తో, భార్య హఫీజా వైపర్ ఐరన్ పైప్‌తో షాదుల్ మెడపైన, వీపుపై బలంగా కొట్టగా షాదుల్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ క్రమంలో స్థానికులు అతన్ని హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. షాదుల్ చికిత్స పొందుతూ ఈ నెల 17న రాత్రి మృతి చెందాడు. ముస్తాబాద్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న సిరిసిల్ల రూరల్ సిఐ, ముస్తాబాద్ ఎస్ ఐ జ్యోతి తెలిపారు.

# నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా బి. వంశీ కృష్ణ



ప్రజా స్ఫూర్తి, నల్లగొండ : నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా నియమితులైన ప్రత్యేక గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ బి. వంశీ కృష్ణ సోమవారం, ఉదయం 10.00 గంటలకు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## కేకే కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమకారుల సలహాలు సూచనలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : హైదరాబాదులోని శృతి వనం అమర జ్యోతి భవనంలో కే కే కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమకారుల సదస్సులో తెలంగాణ ఉద్యమకారుల సలహాలు, సూచనలు నిర్వహించడం జరిగింది. తెలంగాణ ఉద్యమ రాష్ట్ర సమితి జిల్లా అధ్యక్షులు బాషికాల అంబరీష పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రతి ఉద్యమకారునికి 250 గజాల స్థలము, 25 వేల పెన్షన్, ఉద్యమకారులకు ప్రతి జిల్లాలో ఉద్యమకారుల భవనాలు నిర్మించి ఇవ్వాలని, ఉద్యమకారులకు హెల్త్ కార్డు, ఫ్రీ బస్సు పాసులు, వారి పిల్లలకు కార్పొరేటు విద్య, వైద్యం అందించాలని ఉద్యమంలో వయసును పెట్టుబడి పెట్టి నష్టపోయిన ప్రతి ఉద్యమకారునికి 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం ఇచ్చి వారికి పారిశ్రామికంగా ప్రోత్సహించాలని ఉద్యమంలో పాల్గొన్న ప్రతి వారిని గుర్తించి వారికి తగు సాయం చేయాలని తెలిపారు చాలామంది లేరు కానీ పరోక్షంగా ఉద్యమ సమయంలో సహాయపడిన వారి వారందరికీ ఉద్యములో పనిచేసిన వారితో ఐడెంటిఫికేషన్ ఇప్పించి వారి కి తగిన ఉద్యమకారుల గుర్తింపు ఇవ్వాలని కోరినారు.

## ప్రజావాణికి బ్రేక్..
# జూలై 20న గ్రీవెన్స్ రద్దు




జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్ ) కార్యక్రమాన్ని 20వ తేదీన రద్దు చేసినట్లు శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 20 వ తేదిన హను మకొండలో మంత్రివర్గ సమావేశం నిర్వ హించనున్న నేపథ్యంలో,అదే రోజున జ రగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి,ఆ రోజున ప్రజావాణి కార్యక్రమానికి రావద్దని,త మ ఫిర్యాదులను తదుపరి ప్రజావా ణి కార్యక్రమంలో సమర్పించాలని కలెక్ట ర్ సూచించారు.

## సివిల్ సప్లై హమాలి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పాపగల్ల శంకరయ్య



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం మందోళ్ళ గూడెం గ్రామానికి చెందిన పాపగళ్ల శంకరయ్య సివిల్ సప్లై హమాలీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవ ఎన్నికయ్యారు. ఏఐటీయూసీ అనుబంధ తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లై హమాలీస్ యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా 3వ మహాసభ మోత్కూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలో చౌటుప్పల్ మండలం మందోళ్ళ గూడెం గ్రామానికి చెందిన పాపగళ్ల శంకరయ్యను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పాపగళ్ల శంకరయ్య మాట్లాడుతూ జిల్లాలోని సివిల్ సప్లై హమాలీ కార్మికులను సంఘటితం చేసి వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడతానన్నారు. నూతన జిల్లా కమిటీ ఎన్నికకు సహకరించిన సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు బోలగాని సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శంకర్ జిల్లా సహాయ కార్యదర్శి కూరెళ్ళ మత్స్యగిరిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి




ప్రజాస్ఫూర్తి జన్నారం : టీ న్యూస్ పై చేసిన అనుచిత వాక్యలను ఖండించిన ప్రెస్ క్లబ్ జన్నారం మండల కేంద్రంలో జరిగిన ఒక సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ టి న్యూస్ ఛానల్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని జన్నారం ప్రెస్ క్లబ్ వారు డిమాండ్ చేశారు. శుక్రవారం రోజున ప్రెస్ క్లబ్ సభ్యులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక తహసిల్దార్ బక్కయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాజుల లింగన్న గౌడ్, ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ట్యూన్ " టీ న్యూస్ " ఛానల్ ను ఒక తాగుబోతు ఛానల్ గా వక్రీకరించి మాట్లాడడం సరికాదు అని అన్నారు. మీడియా అనేది అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు వారధిగా పనిచేస్తూ, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని లేకుంటే జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జన్నారం ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు చిలువేరు నరసయ్య, అధ్యక్షుడు లింగన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి జాడి వెంకటయ్య, స్థానిక పాత్రికేయులు మల్లేశం, కాంతయ్య, సతీష్, సత్యం,ప్రశాంత్, రాజేందర్,వేణుగోపాల్, శివరామకృష్ణ, శంకర్, భాస్కర్, సత్యం, రమేష్, మహేష్, అజ్మత్, మల్లేష్, పవన్, వెంకటఫణిరాజు, ఖానాపూర్, కడెం,దండేపల్లి, లక్షెట్టిపేట్, మండలాలకు చెందిన సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

# రోడ్డు వెడల్పును తగ్గించి పేద ప్రజలు నష్టపోకుండా కాపాడాలి

* కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చిన కాలనీవాసుల



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ బజార్ రోడ్డును 70 అడుగుల వరకు విస్తరించేందుకు మున్సిపల్ అధికారులు చేపట్టిన మార్కింగ్‌ను నిలిపివేసి, రోడ్డు వెడల్పును తగ్గించాలని కోరుతూ కాలనీవాసులు శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున రెడ్డి, బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పేరుతో పేద ప్రజలు తమ నివాసాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇదే రోడ్డును 100 అడుగుల వరకు విస్తరించాలని అధికారులు మార్కింగ్ చేయగా స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా, రోడ్డు వెడల్పుపై స్పష్టమైన నిర్ణయం వెలువడలేదన్నారు.ప్రస్తుతం సుమారు 40 అడుగుల వెడల్పు ఉన్న రోడ్డులో 22 అడుగుల బీటీ రోడ్డు ఉండగా వాహనాల రద్దీ కూడా పెద్దగా లేదన్నారు. మరోవైపు రామవరం వైపు బైపాస్ రోడ్డు ప్రతిపాదన ఉన్న నేపథ్యంలో ఈ రోడ్డును 70 అడుగులకు విస్తరించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు.హుస్నాబాద్ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేసే నిర్ణయాలను అంగీకరించబోమన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు విస్తరణ ప్రణాళికను పునఃపరిశీలించి, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. భూక్యా లక్ష్మన్ నాయక్, మార్క శ్రీనివాస్, పెరుమాండ్ల శ్రీనివాస్, లక్ష్మిరాజిరెడ్డి మొండయ్యతో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## మిర్చి రైతులకు రూ.90 లక్షలకుపైగా టోకరా.. ఇద్దరి అరెస్ట్




జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): అధిక ధరలు ఇప్పిస్తామని నమ్మించి మిర్చి రైతులను రూ.90 లక్షలకుపైగా మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితులను భూపాలపల్లి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కీలక పత్రాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. చిట్యాల సీఐ డి. మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే భట్టీకి రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు అదనంగా చెల్లిస్తామని జంగం రమేష్, శతరాసి రాజు, శతరాసి స్వప్న, బల్గా రాజు నమ్మించారు. ఈ క్రమంలో సుమారు రూ.1.20 కోట్ల విలువైన మిర్చిని కొనుగోలు చేశారు. అయితే రైతులకు రూ.30 లక్షలు మాత్రమే చెల్లించి, మిగిలిన రూ.90 లక్షలకు పైగా బకాయి ఉంచి మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది.మోసపూరితంగా సేకరించిన మిర్చిని అక్కంపేటకు చెందిన వేణుగోపాల్ సహకారంతో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసి, కొంత విక్రయించి వచ్చిన డబ్బుతో వాహనాలు కొనుగోలు చేయడంతో పాటు వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదైన విషయం తెలుసుకున్న అనంతరం తమ పేర్లపై ఉన్న ఆస్తులను బొడ్డు నాగరాజు పేరిట బదిలీ చేసి పరారైనట్లు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా సీసీఎస్, మొగుళ్లపల్లి పోలీసుల సంయుక్త బృందం రంగాపూర్ గ్రామంలో జంగం రమేష్, శతరాసి రాజును అరెస్ట్ చేసింది. వారి సంస్థలైన ASK Agros, REnterprisesకు సంబంధించిన పత్రాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుంది. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు.పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన చిట్యాల సీఐ డి. మల్లేష్, మొగుళ్లపల్లి ఎస్ఐ ఎం. సురేష్, సీసీఎస్ సీఐ రమేష్, ఎస్ఐ నరేష్‌తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందించారు.

## ఇందిరమ్మ ఇళ్లకు ఇంటి నెంబర్లు వేయాలంటూ కలెక్టరేట్ ముట్టడి

* ఉద్రిక్తత, సీపీఎం నేతల అరెస్ట్



జనగామ, ప్రజాస్ఫూర్తి : మూడో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నెంబర్లు కేటాయించి, డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివసిస్తున్న వారికి ఆన్‌లైన్ నమోదు, విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి సహా పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో మోకు కనకారెడ్డి మాట్లాడుతూ, మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులకు వెంటనే ఇంటి నెంబర్లు కేటాయించాలని, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.గతంలో ఇంటి నెంబర్లకు సంబంధించిన ఫైలు సిద్ధమైనప్పటికీ, ప్రస్తుతం ఆ ప్రక్రియ నిలిచిపోయిందని ఆరోపించారు. ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా సానుకూలంగా స్పందించినప్పటికీ జిల్లా పరిపాలన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ధర్నా సందర్భంగా కలెక్టరేట్ ఎదుట సుమారు మూడు గంటల పాటు లబ్ధిదారులు ఎర్ర జెండాలతో నిరసన చేపట్టారు. పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి సీపీఎం నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, లబ్ధిదారులకు మధ్య తోపులాట చోటు చేసుకోగా, పలువురికి స్వల్ప గాయాలైనట్లు సీపీఎం నాయకులు తెలిపారు.అనంతరం పోలీస్ స్టేషన్ లో ఇన్‌చార్జి ఏసీపీ భీమ్ శర్మ తమ పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ సీపీఎం నాయకులు అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.ఏసీపీ వ్యాఖ్యలపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా,పట్టణ నాయకులు, మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులు,మహిళలు, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ ప్రజల రక్షణ.. సౌకర్యమే ప్రథమ ప్రాధాన్యత

* కోతుల బెడదకు చెక్
* చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల రక్షణ.. సౌకర్యమే తన ప్రథమ ప్రాధాన్యత అని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలో గత కొన్ని రోజులుగా తీవ్రంగా ఉన్న కోతుల బెడదను నివారించేందుకు మున్సిపల్ చైర్ పర్సన్ ఆదేశాల మేరకు మున్సిపల్ యంత్రాంగం శనివారం ప్రత్యేక చర్యలు చేపట్టింది. పట్టణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ప్రత్యేక చొరవతో ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నుంచి ప్రత్యేక కోతులు పట్టే నిపుణుల బృందాన్ని రప్పించారు. ఈ బృందం చౌటుప్పల్ పట్టణంలో విద్యానగర్ పరిసరాలలో, హెచ్ పీ గ్యాస్ సమీపంలో, కచ్చీరు ప్రాంతం వద్ద ప్రత్యేక బోనులను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో శనివారం ఉదయం రాజమండ్రి బృందం సుమారు 211కోతులను బంధించారు. పట్టుబడిన కోతులను సురక్షితంగా ములుగు జిల్లాలోని మాటు కొండూరు అటవీ ప్రాంతంలో వదిలివేయడానికి తరలించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ గత కొన్నాళ్లుగా కోతుల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి, ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. మున్సిపాలిటీ పరిధి మొత్తం కోతుల బెడద నుంచి విముక్తం చేసేందుకు ఈ చర్యలు కొనసాగుతాయన్నారు. కోతుల బెడద నుంచి ఉపశమనం కలిగించేందుకు చొరవ తీసుకున్న చైర్‌పర్సన్, పాలకవర్గానికి పట్టణ ప్రజలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపారు. ఇంకా చాలా కోతులు ఉన్నాయని పట్టణం మొత్తం కోతుల బెడద నుంచి విముక్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పాక చిరంజీవి, హన్ను మహమ్మద్, బద్రి గాలయ్య, చింతల ఉమామహేశ్వరి, నాయకులు చింతల సాయిలు, బత్తుల దాసు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులకు జీవీఆర్'నగదు ప్రోత్సహకాలు

* జీవీఆర్ సేవలు అభినందనీయం ఎంఈఓ కృష్ణ



అందోలు, ప్రజాస్ఫూర్తి: జోగిపేట బాలుర ఉన్నత పాఠశాలలో 2025-26 సంవత్సరంలో పదవతరగతిలో మంచి మార్కులు సంపాదించిన ఉత్తమ విద్యార్థులకు జీవీఆర్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా నలుగురు విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు డిక్షనరీని అందోలు మండల విధ్యాధికారి బండి కృష్ణ, జీవీఆర్ ఛారిటబుల్ చైర్మన్ సీహెచ్.గోవర్ధన్‌రెడ్డి, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు ఎ.మాణయ్యలు పంపిణీ చేసారు. పదవతరగతిలో జేఎస్.జరాద్ రాజు (574), ఎస్.సాత్విక్ (569), బి.ఆకాష్ (565), ఎం.నాగరాజు (565) మార్కులు సంపాదించారు. ఈ సందర్భంగా ఈ విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఎంఈఓ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదును జీవీఆర్ ఛారిటబుల్ ట్రస్టు వారు అందజేసి ప్రొత్సహించడం అభినందనీయమన్నారు. గతంలో కూడా ట్రస్టులోని పూర్వ విద్యార్థులు ఎన్నో సామాజిక, సేవా కార్యక్రమాలను చేపట్టారని అన్నారు. పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు ఎ.మాణయ్య మాట్లాడుతూ గత కొంత కాలంగా పూర్వ విద్యార్థులు గోవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నారు. పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని కూడా వీరే ఏర్పాటు చేసారన్నారు. ట్రస్టు చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులను అందజేస్తామని ప్రకటించారు. ఈ పాఠశాలలో చదువుకున్న తాము పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరేశ్, పీఆర్‌టీయు నాయకులు నరోత్తం, మాంజ్యానాయక్,శేఖర్, ట్రస్ట్ సభ్యులు రాంబాబు బి.వెంకటేశ్వర్, కే.ప్రతాప్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి శంకర్, నర్సింహులు, ధర్మేందర్, రవీందర్ రెడ్డి కొత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట జిల్లా అభివృద్ధి ప్రధాత మాజి మంత్రి , సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అన్నదానాలు, అల్పాహార పంపిణీ, కేక్ కటింగ్, పండ్ల పంపిణీ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.60 ఫీట్ రోడ్డులో బొలిశెట్టి మధు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించగా నాయకులు అంతటి విజయ్, టైసన్ శ్రీను, రియాజ్, శీలా శంకర్, బచ్చు జగన్, రౌతు రవిందర్ రావు, చెరకు వెంకన్న, కార్తిక్, పోతురాజు అనిల్, పాల్గొన్నారు.అదే విధంగా 22వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి మోత్కూరు సందీప్ ఆధ్వర్యంలో వార్డు ప్రజల మధ్య కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టైసన్ శ్రీను, శ్రీనివాస్, బండారు సతీష్, సుజాత, లక్ష్మి, సౌజన్య, అంజయ్య, దుర్గారావు, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ట్రినిటీలో ఘనంగా పింక్ డే




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ పాఠశాలలో పింక్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ట్రినిటీ పాఠశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల హాజరయ్యారు. చిన్నారి విద్యార్థులకు పింక్ కలర్ యొక్క ఆవశ్యకతను వివరించారు. ఇంద్రధనస్సు మాదిరిగా వివిధ రకాల రంగులను చిన్నారి విద్యార్థులకు ప్రదర్శించారు. రాష్ట్రంలో వర్షాలు కురువక కరువు పరిస్థితులు ఉన్నందున విద్యార్థుల చేత కప్పల పెళ్లి చేశారు అనంతరం ఉజ్జిని మంజుల మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని రైతుల ఇంట సిరులు ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ట్రినిటీ పాఠశాల చైర్మన్ కె వి బి కృష్ణారావు, ఉపాధ్యాయులు స్వప్న, షాను, ఉమారాణి, అనిత, వరలక్ష్మి, మీనాక్షి, మౌనిక, శ్రావణి, అనూష, శోభ తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతోంది

* మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగవుతుండడంతో ఇక్కడికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శనివారం హైదరాబాద్ వెంగళ్‌రావు నగర్‌లోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్' కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ''ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు మెరుగుపడడంలో సూపరింటెండెంట్ల పాత్ర అత్యంత కీలకం. రోగులు పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకుంటూ, వారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు, డాక్టర్లు, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అందరిపైనా ఉంది. సేవల నాణ్యత విషయంలో సూపరింటెండెంట్లు ఎలాంటి సాకులు చెప్పొద్దు. ఏ అవసరం ఉన్నా జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్, శాఖాధిపతి మొదలుకొని మంత్రి వరకూ అందరికీ సమాచారం చేరవేయాలి. డాక్టర్లు, నర్సులు, సిబ్బంది సమయపాలన పాటించాలి. ఆసుపత్రుల పనితీరును ఇకపై నిరంతరం సమీక్షిస్తాం. ఇందుకోసం డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేస్తున్నాం'' అని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లా సమస్యలపై సమీక్ష సమావేశంలో చర్చించాలి

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 20, 21వ తేదీలలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లాల సమీక్షలో చర్చించి పరిష్కార మార్గాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు.శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో ప్రభావంతో వ్యవసాయ రంగంతో పాటు త్రాగునీరు, వాతావరణం,ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో రాబోవు రోజులలో త్రాగునీరు, ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల సాగు,




విద్యుత్ సరఫరా,పారిశుద్ధ్యం, సీజనల్ వ్యాధుల నియంత్రణ అంశాలపై చర్చించి సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని తెలిపారు.వరి సాగుకు బదులుగా ఆదాయాన్ని పెంపొందించే ఆరుతడి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని, ఆ దిశగా చేపట్టవలసిన చర్యలపై సమీక్షలో చర్చించాలని తెలిపారు. ప్రజారోగ్య రక్షణలో భాగంగా సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రజలకు అందించవలసిన వైద్య సేవలపై సమీక్షించాలని తెలిపారు. రిజర్వాయర్లు నీటి నిల్వ, సమగ్ర సరఫరా అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమగ్ర ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, జిల్లా స్థాయి అధికారులతో మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి మంగళవారం జిల్లా ఇన్చార్జి మంత్రిచే నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ శాఖల వారీగా తాజా ప్రగతి నివేదికలను యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేసి, పూర్తి సమాచారంతో సమర్పించాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు, రెవెన్యూ కె అనిల్ కుమార్, పురుషోత్తం,డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, ఉద్యానవన శాఖ అధికారి జి . మరియన్న,జిల్లా పంచాయతీ అధికారి హరి ప్రసాద్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్,ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, ఎలక్ట్రిసిటీ ఎస్సీ విజయ్ చందర్ రెడ్డి, మిషన్ భగీరథ, గ్రౌండ్ వాటర్, అన్ని విభాగాల సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శిగా గడ్డం సమ్మయ్య గౌడ్ నియామకం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : గౌడ జనాక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శిగా మహబూబాబాద్ జిల్లా, ముడుపుగల్ గ్రామానికి చెందిన గడ్డం సమ్మయ్య గౌడ్ ను జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్, జనరల్ సెక్రటరీ రాగుల సిద్ధ రాములు గౌడ్ నియమించారు,సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నన్ను మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి గా నిమించిన జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్,జనరల్ సెక్రెటరీ సిద్దిరాములు గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి కొండాపురం బాలరాజు గౌడ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ ముత్యం నరసింహులు గౌడ్, మోకు దెబ్బ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ముంజల రాజేందర్ గౌడ్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.గౌడ సమస్యలపై నిరంతరం పోరాడుతాను, ప్రతి గీత కార్మికుడికి ఐడి కార్డు ఇప్పిస్తానని కమిటీ నిర్మాణంలో భాగమవుతానని తెలియజేశారు.

## గిరిజన కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:కరకగూడెం పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన రాబిన్ హుడ్ స్వచ్ఛంద సంస్థ తరపున నీలాద్రిపేట, గండి, అశ్వాపురంపాడు, గుత్తికోయ గ్రామాల్లోని గిరిజన కుటుంబాలకు శనివారం నిత్యావసర సరుకులు, చీరలు, సోలార్ విద్యుత్ లైట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని చెప్పారు. గ్రామస్తులు మద్యపానం, దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించి వారి విద్యను కొనసాగించేలా సహకరించాలని అవగాహన కల్పించారు. గ్రామాల్లో శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడుల్లా బయ్యారం సీఐ వి. వెంకటేశ్వరరావు, కరకగూడెం ఎస్సై పి.వి.ఎన్. రావు, రాబిన్ హుడ్ స్వచ్ఛంద సంస్థ సేవకులు భూసారపు రమేష్, పోలీస్ సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీమంత్రి జగదీశ రెడ్డి జన్మదిన వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం దండు మల్కాపూరం శ్రీ ఆందోళ మైసమ్మ దేవాలయం పరిధిలో ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ ఆందోళ మైసమ్మ దేవాలయం పరిధిలో ఒక మొక్కను నాటి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి మళ్లీ మంత్రి పదవి చేపట్టి, ఉమ్మడి నల్లగొండ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో దండు మల్కాపురం బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ముదిగొండ వెంకటేష్, ధర్మోజిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తుల సింహాద్రి, గుడిమల్కాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు సిద్ధగోని శ్రీనివాస్, మండల నాయకులు గుండు లింగన్న గౌడ్, సుర్వి లింగస్వామి గౌడ్, కత్తుల సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

* **భోధి వృక్ష ఒలింపియాడ్ పాఠశాలలో ఘనంగా వన మహోత్సవం**

జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని వెంకటాద్రినగర్ లో గల భోధి వృక్ష ఒలింపియాడ్ పాఠశాలలో శనివారం వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. అనంతరం వారు మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో దివాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, భార్గవి రెడ్డి, వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్‌లో మెరిసిన అనాథ బాలిక

* **చిన్నప్పుడే తల్లిదండ్రులు దూరం**
* **బీసీ గురుకులం ప్రోత్సాహంతో ర్యాంకు**

హైదరాబాద్: ఆ బాలికకు రెండేళ్ల వయసున్నపుడు తండ్రి, పదేళ్లు వచ్చేసరికి తల్లి అనారోగ్యంతో కన్నుమూశారు. తన తల్లిదండ్రులకు వచ్చిన దుస్థితి ఎవరికీ రాకూడదనే.. ఆమె వైద్యురాలిని కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ బాలిక పేరు తోకల ముత్తవ్వ. బీసీ గురుకుల కళాశాల(సరూర్‌నగర్)లో చదివిన ఈమె నీట్ యూజీ 2026లో 406 స్కోరుతో.. జనరల్ ర్యాంకు 2,58,017 ఓబీసీ కేటగిరీ ర్యాంకు 1,22,138 సాధించారు. రాష్ట్రంలో కన్వీనర్ కోటాలో సీటు వస్తుందని ఆశిస్తున్నారు. నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం లోశ్ర గ్రామానికి చెందిన ముత్తవ్వ బీసీఏ కేటగిరీకి చెందిన బాలిక. తల్లిదండ్రులు మరణించడంతో బాబాయి, మామ.. ఈమె బాగోగులు చూసుకున్నారు. నాలుగో తరగతి వరకు స్థానికంగా చదివిన ఆమెను ఐదోతరగతి నుంచి ఖానాపూర్ బీసీ గురుకుల పాఠశాలలో చేర్పించారు. అక్కడ పదోతరగతిలో అత్యుత్తమ మార్కులు రావడంతో సరూర్‌నగర్ బీసీ గురుకుల బాలికల సీవోఈలో ప్రవేశం లభించింది. అక్కడే ఇంటర్ పూర్తిచేసి 979 మార్కులు పొందారు. ముత్తవ్వ పరిస్థితులు తెలుసుకున్న బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు.. ప్రత్యేక మార్గదర్శనం చేశారు. దీంతో నీట్ పరీక్షలో 406 మార్కులు సాధించారు. ‘‘నా తల్లిదండ్రులు వైద్య సదుపాయాల్లేక.. అనారోగ్యంతో చనిపోయారు.

## ఇందిరమ్మ చీరలతో మహిళల ముఖాల్లో చిరునవ్వులు

* **23వ వార్డులో పంపిణీ.. చేసినకౌన్సిలర్ బర్రె పూజిత-జహంగీర్**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : భువనగిరి మున్సిపల్ పట్టణ పరిధిలోని 23వ వార్డులోని ఇందిర నగర్ కాలనీలో శనివారం మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బర్రె జహంగీర్ మాజీ చైర్మన్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం, సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిలో భాగంగానే ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా మరింత ముందుకు రావాలని సూచించారు. వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ మాట్లాడుతూ, తమ వార్డులో అర్హులైన ప్రతి మహిళా సంఘ సభ్యురాలికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాన్ని వార్డులో సమర్థవంతంగా అమలు చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించిన ఆకర్షణీయమైన రంగుల్లో నాణ్యమైన చీరలను అందుకున్న మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ పి సుదర్శనం మంజుల, అనిల్ నాయక్ వార్డ్ ఇంచార్జ్, స్థానిక ప్రజాప్రతినిధులు, పురపాలక శాఖ అధికారులు, ఆర్పీలు, మహిళా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

## కాళేశ్వరం నీటిని సాగు, తాగునీటికి వినియోగించాలి

* **ప్రభుత్వం వైఖరి స్పష్టం చేయాలి.. లేకుంటే పోరాటాలు తప్పవు**
* **సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రధాన లక్ష్యంగా ఉండాలని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీటిని అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టంగా వెల్లడించాలని, నిర్లక్ష్యం కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. శనివారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధిలోని కన్నెపల్లి పంప్‌హౌస్, అన్నారం బ్యారేజ్, మేడిగడ్డ ప్రాజెక్టును సీపీఐ(ఎం) బృందం పరిశీలించింది. అనంతరం మేడిగడ్డ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కన్నెపల్లి నుంచి అన్నారం బ్యారేజ్‌కు నీటిని ఎత్తిపోసి కనీసం 2 నుంచి 3 టీఎంసీల నీటిని నిల్వ చేస్తే సాగునీటితో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు దాదాపు టీఎంసిన్నర నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని, ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే ఈ నీటిని ప్రజల అవసరాలకు వినియోగించే అవకాశం ఉండేదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు మున్న నాగేశ్వరరావు, జంగారెడ్డి, సుధాకర్ రెడ్డి, కారం పుల్లయ్య, వర్ణ వెంకట్ రెడ్డి, కరీంనగర్ జిల్లా కార్యదర్శి వాసుదేవ్ రెడ్డి, జిల్లా నాయకులు పోలేం పెద్ద రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్నవారి ప్రాణాలు రక్షించవచ్చు

* **జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీరాజ్ శాఖ వారిచే రక్తదాన శిబిరం జరిగింది.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండటంతో పాటుగా ఆపదలో ఉన్న వారిని ప్రాణాలను రక్షించే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. రెడ్ క్రాస్ రాష్ట్ర కార్యదర్శి, సీఈవో ప్రొఫెసర్ శ్రీరాములు మాట్లాడుతూ అందులో సగం కూడా దాతలు నుంచి సేకరించబడటం లేదన్నారు. రాష్ట్రంలో 8 బ్లడ్ బ్యాంకులు ఉన్నాయని 9వ బ్లడ్ బ్యాంకు గా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో త్వరలోనే భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు ఇందుకోసం రాష్ట్ర రెడ్ క్రాస్ రెండు కోట్ల మేర ఎక్విప్మెంట్ను తమకూర్చనిందని భవన నిర్మాణం కోసం దాత శ్రీధర్ రెడ్డి అయిదు కోట్ల మేర వితరణ చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని వివరించారు రాష్ట్ర గవర్నర్ , రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ దాన కిషోర్ సూచనల మేరకు రాష్ట్రంలో లక్ష రెడ్ క్రాస్ సభ్యత్వం చేయాలన్న లక్ష్యంలో ఇప్పటివరకు 42 వేల సభ్యత్వాన్ని పూర్తి చేసినట్లు శ్రీరాములు వివరించారు. రెడ్ క్రాస్ లో సభ్యులుగా చేరి స్వచ్ఛంద సేవ చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛంద కార్యకర్తలు యువకులు ప్రజలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు జిల్లా ఆదనపు కలెక్టర్ వెంకారెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేయడంలో యువత ముందుండాలని కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ విద్య నగర్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది 86 మంది రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డిఓ కృష్ణారెడ్డి, సీఈవో శోభారాణి, చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి, డి ఆర్ డి ఓ నాగిరెడ్డి, అదనపు పిడి సురేష్, డిహెచ్ఎంఓ మనోహర్ ,డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి హరి శివ ప్రసాద్, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి. లక్ష్మీనరసింహారెడ్డి, స్టేట్ ఎంసీ మెంబర్ ఆర్ మహేందర్ రెడ్డి,డివిజన్ చైర్మన్ సద్ది వెంకటరెడ్డి, జిల్లా డైరెక్టర్లు శేక్. హమీద్ పాశ, పి శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఎన్. చారి, టౌన్ అధ్యక్షుడు వై పురుషోత్తం రెడ్డి , డివిజన్ ప్రతినిధులు రామ్ రెడ్డి, చంద్రశేఖర్, లావణ్య, కవిత,భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

**: సీఎస్ సంజయ్ జాజు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. శనివారం డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ప్రభావాన్ని తగ్గించేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని సూచించారు. వాతావరణ శాఖ అంచనాల మేరకు రైతులకు ముందస్తు సమాచారం అందించడంతో పాటు తక్కువ వర్షపాత పరిస్థితులకు అనుగుణంగా స్వల్ప, మధ్యకాలిక పంటల విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే బిందు సేద్యం, పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.నీటి పారుదల ప్రాజెక్టుల్లో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి కొరత లేకుండా మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని పేర్కొన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా నిరంతర విద్యుత్ సరఫరా, పశువులకు మేత, ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి, ఈ నెల 21న వరంగల్‌లో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగే సమీక్షా సమావేశానికి అన్ని శాఖలు ఎల్ నినో ప్రభావంపై శాఖల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పుష్కరాల్లో భద్రత కోసం ముందస్తు ప్రణాళిక అవసరం

**: ఎస్పీ రోహిత్‌రాజు**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ రోసిత్ రాజు అధికారులను ఆదేశించారు. ఘాట్ల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో పోలీస్ అధికారులతో శనివారం ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న పుష్కర ఘాట్ల వద్ద భక్తుల భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, చెక్ పోస్టుల ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ప్రధాన రహదారులు, పుష్కర ప్రాంతాలకు వచ్చే మార్గాల్లో అవసరమైన చోట చెక్ పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను పర్యవేక్షించాలని తెలిపారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించాలని, వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఘాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలను పటిష్టం చేయాలని, రిస్క్ ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్కరాల సమయంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలని పోలీస్ చెప్పారు. ఈ సమావేశంలో జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు ఈ నెల 20 ఆఖరు

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బహదూర్ పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు ఈ నెల 20వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బండి రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ అభ్యసించేందుకు ఈ నెల 20వ తేది వరకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కళశాలలో బీఎ, బీకాం కంప్యూటర్, బి.ఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ ఫిజికల్ సైన్స్ కోర్సులున్నాయని తెలిపారు. ఆదివారం తమ దరఖాస్తులను ఆన్లైన్లో చేసుకుని సోమవారం కళాశాలలో ప్రిన్సిపల్ ను సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీధర్ 94403 75698, జూనియర్ అసిస్టెంట్ వి.రంజీత్, 79894 11892, వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యవస్థాపకులు ఇక్కుర్తి నారాయణరావు 98490 42005 కి సంప్రదించి పూర్తి వివరాలను తెలుసుకోవాలని తెలిపారు.

# నీటిని పొదుపుగా వాడాలి.. భూగర్భ జలాలను రక్షించాలి

: అన్నా మెమోరియల్ స్కూల్‌లో ఘనంగా 'జాతీయ జల మిషన్' జల ప్రతిజ్ఞ

* చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నీటిని పొదుపుగా వాడుకుంటూ.. భూగర్భ జలాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. జాతీయ జల మిషన్ కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం అన్నా మెమోరియల్ స్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు శనివారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్ హాజరయ్యారు. స్కూల్ ప్రిన్సిపల్ చిన్నప్ప రెడ్డి, విద్యార్థులు, సిబ్బందితో 'జల ప్రతిజ్ఞ' చేయించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల వర్షభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని అధికారిక హెచ్చరికలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను తప్పనిసరిగా నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూమిలోకి ఇంకేలా చూడడం ద్వారానే భూగర్భ జల మట్టాలను పెంచుకోవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణలో యువత, విద్యార్థులు అగ్రభాగంలో నిలిచి భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ సిఐ మన్మధ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు బుద్ద సురేష్, చింతల ఉమామహేశ్వరి సాయిలు, నాయకులు బాతరాజు సత్యం, మున్సిపల్ అధికారులు హనుమాన్ ప్రసాద్, రేణు కుమార్, వార్డు ఆఫీసర్లు పవన్ కుమార్, కిరణ్ కుమార్, శ్రీనాథ్, ఉపేందర్, వంశీ, పాఠశాల ఉపాధ్యాయ బృందం, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భోధి వృక్ష ఒలింపియాడ్ పాఠశాలలో ఘనంగా వన మహోత్సవం



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని వెంకటాద్రినగర్ లో గల భోధి వృక్ష ఒలింపియాడ్ పాఠశాలలో శనివారం వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. అనంతరం వారు మొక్కల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో దివాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, భార్గవి రెడ్డి, వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## విభేదాలు పక్కన పెట్టి కలిసి పనిచేయండి

* బండి సంజయ్, ఈటలలకు భాజపా అధిష్ఠానం స్పష్టీకరణ
* కె.లక్ష్మణ్ నివాసంలో సయోధ్య కుదిర్చిన అభయ్‌పాటిల్



హైదరాబాద్: విభేదాలు పక్కన పెట్టి.. కలిసి పనిచేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌లకు భాజపా అధిష్ఠానం సూచించింది. పలు సందర్భాల్లో వారి మధ్య విభేదాలు బహిర్గతమైన నేపథ్యంలో అధిష్ఠానం సీరియస్‌గా తీసుకొంది. సయోధ్య కుదిర్చేందుకు పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్‌పాటిల్‌ను రంగంలోకి దింపింది. రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ నివాసంలో శనివారం అభయ్‌పాటిల్.. బండి సంజయ్, ఈటలతో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. 'రాష్ట్రంలో అధికారంలోకి రావాలనే లక్ష్యంతో భాజపా పనిచేస్తోంది. సొంత పార్టీలో ఇలా విభేదాలు తలెత్తడం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. విభేదాలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలి' అని ఆయన వారికి సూచించినట్టు విశ్వసనీయ సమాచారం. పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తే అధిష్ఠానం తీవ్రంగా పరిగణిస్తుందని అభయ్ స్పష్టం చేసినట్టు తెలిసింది. వారి మధ్య సయోధ్య కుదిరినట్టు సమాచారం. అనంతరం కె.లక్ష్మణ్.. సంజయ్, ఈటలతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'పార్టీ బలోపేతం కోసమే ఈ భేటీ జరిగింది.

## పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

: ఎస్ఎఫ్ఐ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.10,500 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తీగుళ్ళ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండల పరిధిలోని ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలతో శ్రీ చైతన్య పారామెడికల్ కళాశాలలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు దాసరి ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీగుళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికీ విడుదల కాకపోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా అనేక ప్రైవేట్ కళాశాలలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు. మరోవైపు విద్యార్థులు సర్టిఫికెట్లు పొందడంలో, ఉన్నత విద్య కొనసాగించడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ, నేటికీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. విద్య అనేది హక్కు తప్ప భారంగా మారకూడదని, ప్రభుత్వం వెంటనే బకాయిలన్నింటినీ విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పారా మెడికల్ ప్రిన్సిపల్ శేఖర్ రెడ్డి, ప్రతిభ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిలువేరు శ్రీనివాస్, నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కట్టెల లింగస్వామి, మాతృశ్రీ డిగ్రీ కళాశాల మహేందర్ రెడ్డి, జేబిఎం ఒకేషనల్ జూనియర్ జంగయ్య, శ్రీ గాయత్రి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆంజనేయులు, బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్, ఎస్ఎఫ్ఐ నాయకులు అరవింద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వసనీయతకు మారుపేరు పోలీస్ నియామక మండలి: డీజీపీ



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) విశ్వసనీయతకు మారుపేరుగా నిలుస్తోందని.. మండలి నిర్వహించిన పరీక్షల్లో ఇప్పటివరకు ఏ ఒక్క పేపర్ లీకేజీ జరగకపోవడమే ఇందుకు నిదర్శనమని డీజీపీ సీవీ ఆనంద్ కితాబిచ్చారు. మండలితోపాటు పోలీస్ శిక్షణ విభాగం, పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాల పనితీరుపై శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో అనేక నియామక సంస్థల్లో ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనలు చోటు చేసుకుంటున్నా.. టీఎస్ఎల్‌పీఆర్‌బీలో మాత్రం అలాంటి ఉదంతాలకు ఆస్కారం లేకపోవడం అభినందనీయమన్నారు. అనంతరం మండలి ఛైర్మన్ వి.వి.శ్రీనివాసరావు మండలి కార్యకలాపాలను వివరించారు. 2025లో చేపట్టిన 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులు, 1,743 డ్రైవర్ ఆపరేటర్, ఫింగర్‌ప్రింట్ బ్యూరో పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోందన్నారు. అలాగే 198 ఆర్టీసీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ ప్రక్రియ త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన కమ్యూనికేషన్ సెట్‌లను డీజీపీ ఆవిష్కరించారు. సమావేశంలో సీఐడీ డీజీ చారుసిన్హా, పీఅండ్ఎల్ ఐజీ గజరావు భూపాల్, కమ్యూనికేషన్స్ డీఐజీ కిరణ్‌కుమారి, ఎస్పీలు చెన్నూరి రూపేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పాటతో మొదలైన నా ప్రయాణం..

## సక్సెస్ స్టోరీ మానసి పరేఖ్



సింగింగ్‌తో మొదలైన ఆమె కెరీర్.. యాక్టింగ్‌తో కొత్త మలుపు తీసుకుంది. ఇప్పుడు రెండింటిలోనూ సక్సెస్‌ఫుల్‌గా దూసుకెళ్తోంది. లేటెస్ట్‌గా 'జమ్‌కుడి' అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకొచ్చింది. ఈ సినిమా కోసం ఆమె టైటిల్ ట్రాక్ కూడా పాడింది. ఇంతకీ ఆమె ఎవరంటే... గుజరాతీ యాక్ట్రెస్ మానసి పరేఖ్. "ఇంతకుముందు కూడా నా సినిమాలకు నేను పాడా. 'కచ్ ఎక్స్‌ప్రెస్'లో 'కంగ్రాచ్యులేషన్స్' అనే పాట. నేను నటించిన సినిమాలో పాట కూడా పాడడం చాలా హ్యాపీగా అనిపిస్తుంది" అంటోంది మానసి పరేఖ్. ఆమె సక్సెస్‌ఫుల్ జర్నీ గురించి మరిన్ని ముచ్చట్లు తెలుసుకుందాం.

నేను పుట్టింది గుజరాత్‌లో. పెరిగింది ముంబైలో. కాబట్టి రెండింటితో నాకు చాలా కనెక్షన్ ఉంటుంది. చిన్నప్పటి నుంచే మ్యూజిక్ అంటే ప్యాషన్. దాంతో అప్పుడే పాటలు పాడడంలో శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టా. స్కూల్ ఈవెంట్స్, రియాలిటీ షోలు వంటి వాటిల్లో యాక్టివ్‌గా పార్టిసిపేట్ చేశా. దాంతో మంచి పేరొచ్చింది. ఒకసారి ఒక షోకి సెలక్ట్ అయితే, అక్కడి నుంచి మరో అవకాశం దక్కేది. అలా వరుసగా ఎనిమిది టీవీ షోల్లో పార్టిసిపేట్ చేశా. వాటితోపాటు అడ్వర్టైజ్‌మెంట్స్‌లో కూడా కనిపించేదాన్ని. ఒకసారి ఫేమ్ వచ్చిందంటే.. వాళ్లు ఒక రంగంలోనే కాదు. వివిధ రంగాల్లో తమ టాలెంట్ ప్రూవ్ చేసుకునే అవకాశం కూడా వస్తుంది. నా విషయంలోనూ అదే జరిగింది. హిందీ, గుజరాతీ సినిమాలు, షార్ట్ ఫిల్మ్స్ ద్వారా నటనలోకి అడుగుపెట్టా. నాకు నటనలో నా స్కిల్స్ పెంచుకోవడానికి టీవీ షోలు ఉపయోగపడ్డాయి. అది కాకుండా నేను న్యూయార్క్‌లోని 'లీ స్ట్రాస్‌బర్గ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్'లో

### 20 ఏండ్ల అనుబంధం

టెలివిజన్ ఇండస్ట్రీతో నాకు 20 ఏండ్ల అనుబంధం ఉంది. అక్కడ ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నా. టీవీలో పనిచేసేవాళ్లు ఎలాంటి పరిస్థితుల్లోనైనా తమ పని పూర్తి చేయాల్సి ఉంటుంది. వాళ్ల ఎమోషన్స్ అన్నీ పక్కన పెట్టి నటించాలి. అదెలా ఉంటుందంటే.. మిలిటరీ ట్రైనింగ్లా ఉంటుంది అనిపించింది నాకు. ఎన్ని పనులున్నా, ఎలాంటి సమస్యలున్నా ప్రతి రోజూ షూటింగ్‌కి వెళ్లాల్సిందే. ఎలాంటి సిచ్యుయేషన్‌లో అయినా స్థిరంగా ఉండడం టెలివిజన్ నాకు నేర్పించింది. నాకున్న స్కిల్స్‌ను నేను రకరకాలుగా ఉపయోగించుకున్నా. టీవీలో నేను చాలా సవాళ్లు ఎదుర్కొన్నా. నేను 'గులాల్' అనే పాపులర్ షో చేశాను. ఆ షో సెట్ మా ఇంటికి గంటన్నర జర్నీ దూరంలో ఉంటుంది. అంటే, నేను అక్కడికి వెళ్లిరావడానికి జర్నీకి మూడు గంటలు టైం పట్టేది. సెట్లో 14 గంటలు ఉండాల్సి వచ్చేది. మొత్తంగా ప్రతిరోజు నేను 17 గంటలు కష్టపడేదాన్ని. ఏడు గంటలు మాత్రమే నిద్రపోయేదాన్ని. అలా ఒక సంవత్సరం పాటు చేశాను. అయితే, ఆరునెలలు గడిచాక ఒత్తిడి వల్ల హెల్త్ పాడయ్యింది. డాక్టర్ దగ్గరకి వెళ్తే నా ప్రొఫెషన్ గురించి అడిగారు. ఎందుకంటే అప్పటికీ నా కళ్ల చుట్టూ డార్క్ సర్కిల్స్ ఉన్నాయి. కాళ్లు వాచిపోయాయి. చెప్పాలంటే నా ప్రొఫెషన్‌కి నేను ఇలా ఉంటే పనిచేయలేను. అలాంటి సిచ్యుయేషన్‌ని దాటుకుని ఇక్కడి వరకు వచ్చా.

### కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా

వర్క్‌ని, పర్సనల్ లైఫ్‌ని బ్యాలెన్స్ చేయడం చాలా కష్టం అనుకునేదాన్ని. ఇప్పుడు నా ప్రియారిటీలు ఏంటీ? అనేది నాకు తెలుసు కాబట్టి ఆ విధంగా మెయింటెయిన్ చేస్తున్నా. నా వర్క్‌కి ఎంత ఇంపార్టెన్స్ ఇస్తానో, నా కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా. అమ్మ అంటే ఇంట్లో కూర్చుని పిల్లల్ని మాత్రమే చూసుకోవాల్సిన పనిలేదు. నేను సినిమాల్లోకి వచ్చి ఏడున్న ఏండ్లు అవుతుంది. నా కూతురు పుట్టాక, నేను ఏడు సినిమాల్లో నటించా. అంటే, ఏడాదికొక సినిమా చేశా అనుకోవచ్చు. అలా నేను వర్క్, ఫ్యామిలీ రెండింటినీ సమానంగా చూస్తా.

### 'జమ్‌కుడి'.. మర్చిపోలేని సక్సెస్

జమ్‌కుడి సినిమాలో నాది లీడ్ రోల్. అయితే మ్యూజిక్ డైరెక్టర్ ఒక పాట నువ్వు పాడాలని చెప్పారు. పాట అంటే నాకు ఎప్పుడూ ఇష్టమే కాబట్టి ఒప్పుకున్నా. సినిమాలో నటించడం, పాడడం వల్ల నేను క్యారెక్టర్‌కి బాగా కనెక్ట్ అయ్యా. పాటకు ఆడియెన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చూస్తే చాలా హ్యాపీగా అనిపిస్తుంది. గ్లోబల్‌గా వైరల్ అవ్వడం మరింత ఉత్సాహాన్నిస్తోంది. ఇవన్నీ చేయగలుగుతున్నా కాబట్టి నా జర్నీ సంతృప్తికరంగా ఉంది. ఈ సినిమాని మా ఆయన పార్థివ్ గొహిల్ ప్రొడ్యూస్ చేశారు. తను నాలాగే యాక్టర్, సింగర్ కూడా. ఈ సినిమా కథ వినప్పుడే నా క్యారెక్టర్ డిసైడ్ చేశారు. ఆ సినిమా హిట్ అవుతుంది అనుకున్నాం. కానీ గుజరాతీ సినిమాల్లో ఈ ఏడాది బెస్ట్‌గా నిలుస్తుంది అనుకోలేదు. పది రోజుల్లో 8.5 కోట్లు కలెక్ట్ చేసింది. గుజరాతీ సినిమా గొప్పదనం ఏంటో నిరూపించింది అని గర్వంగా చెప్తా.

## బ్యూటీ

# ముఖ సౌందర్యం కోసం..





### కీరా – అలోవెరాతో..

ఒక టేబుల్ స్పూన్ అలోవెరా జెల్‌లో పావు టీస్పూన్ కీరదోస తురుము వేసి బాగా కలపాలి. ఆ ప్యాక్‌ని ముఖం, మెడ భాగాలకు పూసుకోవాలి. పావుగంట తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కుంటే కాంతివంతంగా ఉంటుంది.



### పాలు–తేనెలతో..

ఒక టీస్పూన్ తేనెలో రెండు టీస్పూన్లు పచ్చి పాలు కలపాలి. ఆ రెండూ బాగా మిక్స్ అయ్యేలా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి రెండు లేదా మూడు నిమిషాలు మర్దన చేయాలి. ఆ తర్వాత గోరు వెచ్చని నీళ్లతో ముఖాన్ని కడగాలి. పాలు, తేనెల ఫేస్‌వాష్ వాడితే స్కిన్ కాంతివంతంగా మారుతుంది. జిడ్డు తొలగిపోతుంది. సెన్సిటివ్ స్కిన్ ఉన్న వాళ్లకు ఇది చాలా బాగా పనిచేస్తుంది.

MOVIE TIME

# ప్రియాంక చోప్రా బర్త్‌డే ట్రీట్



మహేష్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతోన్న వారణాసి కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందుతోన్న ఈ సినిమాతో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తోంది. మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా కనిపించబోతున్నాడు. ప్రియాంక చోప్రా బర్త్‌డే సందర్భంగా డైరెక్టర్ రాజమౌళితో పాటు మహేష్‌బాబు ఆమెకు స్పెషల్‌గా విషెస్ చెప్పారు. వారణాసి షూటింగ్‌లో ప్రియాంక చోప్రా సందడి చేస్తోన్న రెండు ఫొటోలను రాజమౌళి అభిమానులతో పంచుకున్నారు. ఓ ఫొటోలో ఆనందంతో సంబరాలు చేసుకుంటూ ప్రియాంక కనిపిస్తోంది. మరో ఫొటోలో ఇంటెన్స్ లుక్‌లో సీరియస్‌గా ఉంది. ఈ రెండు ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్నాయి. మందాకిని నవ్వితే అందం...నవ్వకపోతే నిప్పు కణిక అంటూ ఈ ఫొటోలకు రాజమౌళి క్యాప్షన్ ఇచ్చారు. మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే అంటూ మహేష్‌బాబు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. ఈ మూవీ కోసం ప్రియాంక చోప్రా 30 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకున్నట్లు సమాచారం. తెలుగులో హయ్యెస్ట్ రెమ్యూనరేషన్ తీసుకున్న హీరోయిన్‌గా ప్రియాంక రికార్డ్ క్రియేట్ చేసింది.



# తప్పంతా వారిలోనే ఉంది

పెద్ది మూవీలో జాన్వీకపూర్ రోల్ వివాదం ఇంకా సమసిపోలేదు. ఈ బాలీవుడ్ హీరోయిన్ పాత్రపై వచ్చిన అభ్యంతరాలపై రాజాసాబ్ హీరోయిన్ మాళవికా మోహనన్ రియాక్ట్ అయ్యింది. సినిమాల్లో హీరోయిన్లు గ్లామరస్‌గా కనిపించడంలో ఎలాంటి తప్పు లేదని చెప్పింది. హీరోయిన్లను విమర్శించే క్రమంలోనే కొందరు తమ హద్దులను దాటుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. "ఏ హీరోయిన్ కూడా అందాల ప్రదర్శన విషయంలో తనకు తానుగా హద్దులు దాటాలని అనుకోదు. దర్శకనిర్మాతల ఒత్తిడి, అవకాశాల కోసం పోటీతో పాటు ఇతర కారణాల వల్లే కొన్ని సార్లు ఇష్టం లేకపోయినా గ్లామర్ రోల్స్ చేయడానికి అంగీకరిస్తుంటారు. హీరోయిన్లను విమర్శించే క్రమంలోనే చాలా మంది లిమిట్స్ క్రాస్ చేస్తుంటారు. వారి వ్యక్తిత్వాన్ని అవహేళన చేసేలా కామెంట్లు చేస్తుంటారు. అలాంటివి చూసినప్పుడు బాధ కలుగుతుంది" అని మాళవికా మోహనన్ అభిప్రాయపడింది.



# శ్రీనివాస రామానుజన్ బంధువా..?

ఇటీవల రిలీజైన బ్లాస్ట్ మూవీతో పెద్ద హిట్టును అందుకుంది ప్రీతి ముకుందన్. అప్పటివరకు సాఫ్ట్ రోల్స్ చేస్తూ వచ్చిన ఈ బ్యూటీ బ్లాస్ట్‌లో యాక్షన్ పాత్రలో కనిపించి ఆడియెన్స్‌ను సర్‌ప్రైజ్ చేసింది. కాగా, ఈ అమ్మడు భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌కు ముని మనవరాలు అవుతుందంటూ వార్తలు వినిపిస్తున్నాయి. శ్రీనివాస రామానుజన్ ఫ్యామిలీతో ప్రీతి ముకుందన్ కుటుంబానికి చాలా దగ్గరి బంధుత్వం ఉందని అంటున్నారు. శ్రీనివాసరామానుజన్ 32 ఏళ్లకే చనిపోయారు. ఆయనకు పిల్లలు లేకపోవడంతో ఆయన భార్య ... నారాయణన్ అనే అబ్బాయిని దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న అబ్బాయితో ప్రీతి ముకుందన్ ఫ్యామిలీకి రిలేషన్ ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. మరొకొందరు నెటిజన్లు మాత్రం రామానుజన్ మేనకోడలికి ప్రీతి ముకుందన్ మనవరాలు అవుతుందని అంటున్నారు. ఈ హీరోయిన్ తల్లి వైపు నుంచే గణిత మేధావి కుటుంబానికి బంధుత్వం ఉండొచ్చని చెబుతున్నారు. ఈ పుకార్లలో ఏది నిజమన్నది క్లారిటీ లేదు. ప్రీతి రియాక్ట్ అయితేనే నిజానిజాలేమిటన్నది బయటపడే అవకాశం ఉందని అంటున్నారు.



# ఒక్క హిట్టుతోనే పెంచేసింది

లెనిన్‌తో కెరీర్‌లో తొలి సక్సెస్‌ను అందుకుంది భాగ్యశ్రీ బోర్సే. ఈ సినిమాలో భారతి అనే పల్లెటూరి అమ్మాయిగా నాచురల్ యాక్టింగ్‌తో మెప్పించింది. అందం, తెగువ కలబోసిన క్యారెక్టర్‌లో భాగ్యశ్రీ బోర్సే చూపించిన మెచ్యూరిటీ, వేరియేషన్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. లెనిన్ సక్సెస్‌తో భాగ్యశ్రీ బోర్సే ఫుల్ ఖుషీలో ఉంది. ఈ మూవీ సక్సెస్ మీట్‌లో ఎమోషనల్ అయ్యింది.

**ఆఫర్లు క్యూ...**

లెనిన్ విజయంతో ఈ అమ్మడికి ఆఫర్లు క్యూ కడుతున్నాయట. తన రెమ్యూనరేషన్‌ను పెంచేసినట్లు ప్రచారం జరుగుతోంది. లెనిన్‌కు ముందు సినిమాకు కోటి నుంచి కోటిన్నర వరకు రెమ్యూనరేషన్ తీసుకుంటూ వచ్చింది. కొత్తగా అంగీకరిస్తోన్న సినిమాలకు మాత్రం రెండున్నర కోట్ల నుంచి మూడు కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు చెబుతున్నారు. తెలుగుతో పాటు తమిళంలో ఈ అమ్మడికి ఉన్న స్టార్‌డమ్‌ను దృష్టిలో పెట్టుకొని ఆమె అడిగినంత మొత్తాన్ని ఇవ్వడానికి ప్రొడ్యూసర్లుగా కూడా రెడీగా ఉన్నట్లు టాక్. మరోవైపు ఒక్క హిట్టుతోనే రెమ్యూనరేషన్ పెంచడంపై విమర్శలు కూడా వస్తున్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.